

క్రోసూరు మండలం అందుకూరులో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



అచ్చంపేట మండలం కొత్తపల్లిలో కుళ్లిన పత్తి మొక్కలను పరిశీలిస్తున్న ఏడీఏ హనుమంతరావు

తీవ్రంగా నష్టపోయాం



ఐదు ఎకరాల్లో వరి సాగు చేశా. అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నాట్లు కొట్టుకుపోయాయి. మిగిలినవి నీటిలో మునిగిపోయాయి. దీంతో తీవ్రంగా నష్టపోయా. ఎకరాకు ఇప్పటికే రూ.12 వేలు ఖర్చు అయింది. తిరిగి దమ్ము చేసి నాటు వేయాలంటే మరో రూ.10 వేల వరకు అవసరం. ఇది మాలాంటి రైతులకు భారం కానుంది.

– పడాల చక్రారెడ్డి, రైతు, రొంపిచర్ల

కుళ్లిపోయిన పత్తి పంట



రెండు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. భారీ వర్షాలకు మూడు రోజులపాటు వరద నీటిలోనే పంట ఉంది. బుధవారం చూస్తే పంట మొత్తం కుళ్లిపోయింది. ఏ మాత్రం మొక్కలు బతికే అవకాశం లేదు. తిరిగి సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

– నుంకర శ్రీనివాసరెడ్డి, రైతు, కోగంటి వారిపాలెం, అచ్చంపేట మండలం

ఎవరూ రాలేదు



పత్తి సాగుకు ఎకరాకు రూ.15 వేలు, మిరపకు రూ.10 వేలు, వరికి రూ.10 వేలు ఖర్చు చేశా. ఒక్కసారిగా వరద రావడంతో పంట మునిగింది. తిరిగి సాగు చేయాలంటే అప్పులు చేయాల్సిన దుస్థితి. అధికారులు ఇటువైపే రాలేదు. ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– సయ్యద్ మొహిద్దీన్ సాహెబ్, మునుగోడు, అమరావతి మండలం

సాయం చేయాలి



రెండు ఎకరాల్లో పత్తి సాగు చేశా. భారీ వర్షాలకు నీట మునిగింది. తిరిగి వేయాల్సిన దుస్థితి. ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో విత్తనాలు, ఎరువులివ్వాలి. అప్పుడే మళ్లీ సాగు చేయగలం. ప్రభుత్వం త్వరగా స్పందించాలి. తగిన పరిహారం, సాయం అందించాలి.

– కె. రమేష్, పోదపాడు, పెదకూరపాడు మండలం

ముంచిన వాన.. రైతుల ఆక్రందన

- కోలుకోలేని విధంగా దెబ్బతిన్న అన్నదాతలు
- జిల్లాలో దాదాపు 28,185 ఎకరాల్లో పంట నష్టం
- కనీసం చూసేందుకూ రాని ప్రజాప్రతినిధులు
- పెట్టుబడి సహాయం కోసం కర్షకుల వినతి

అల్పపీడన ప్రభావంతో కొన్నిరోజులపాటు కురిసిన భారీ వర్షాలకు పంట నిండా మునిగింది. దీంతో రైతుల ఆవేదన అంతా ఇంతా కాదు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ముంపులోని పంటలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. జరిగిన నష్టం కంటికి కనిపిస్తుండటంతో అన్నదాతలు విలవిల్లాడుతున్నారు. ఇప్పటివరకు ప్రజాప్రతినిధులుగానీ, అధికారులుగానీ తమ పొలాల వద్దకు రాలేదని వాపోతున్నారు. వెంటనే ప్రభుత్వం తమను అన్నివిధాలా ఆదుకోవాలని కోరుతున్నారు.



అచ్చంపేట మండలం కోనూరులో నీట మునిగిన పత్తి సాగు



అచ్చంపేట మండలం కోగంటివారిపాలెంలో కుళ్లిపోయిన పత్తి పంట

సాక్షి, నరసరావుపేట: జిల్లాలోని అన్నదాతలను భారీ వర్షాలు నట్టేట ముంచాయి. ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ కొట్టాయి. పత్తి పంట నాలుగు రోజుల పాటు నీటిలో ఉండటంతో మొక్కలు కుళ్లిపోయాయి. తిరిగి పంట సాగు చేయడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. ఇప్పటికే పత్తికి ఎకరాకు రూ.15 వేలు, మిరపకు రూ.20 వేలు, వరికి రూ.10 వేల వరకు రైతులు ఖర్చు చేశారు. ఈ దశలో పంట పూర్తిగా తీసేసి మళ్లీ సాగు చేయాలంటే అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం పెట్టుబడి సాయం అందజేయాలని కర్షకులు కోరుతున్నారు. పంట నష్టానికి పరిహారంతోపాటు తిరిగి సాగు చేసేందుకు వంద శాతం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు అందజేయాలని కోరుతున్నారు. ఇప్పటికీ తమ పొలాలను ప్రజాప్రతినిధులు, అధికారులు కనీసం సందర్శించలేదని వాపోతున్నారు.

వేల ఎకరాల్లో పంటకు భారీ నష్టం

పల్నాడు జిల్లాలో ముఖ్యంగా పత్తి, మిరప పంటలను కౌలు రైతులు సాగు చేస్తున్నారు. భారీ వర్షాలకు వారు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం తమకు కూడా పరిహారం అందించాలని కోరుతున్నారు. ప్రాథమికంగా ముంపునకు గురైన పంటల వివరాలను అంచనా వేస్తున్నారు. జిల్లాలో మొత్తం 11,579 మంది రైతులకు చెందిన సుమారు 28,185 ఎకరాల్లో పంట నీట మునిగినట్లు గుర్తించారు. ఇందులో 23,317 ఎకరాల్లో పత్తి, 2,745 ఎకరాల్లో వరి, 627.5 ఎకరాల్లో కంది, 250 ఎకరాల్లో మినుము, 37.5 ఎకరాల్లో జూట్ పంటలకు నష్టం కలిగింది. మరోవైపు జిల్లాలో 527 మంది రైతులకు చెందిన 1,173 ఎకరాల్లో ఉద్యాన పంటలు వర్షాలకు దెబ్బతిన్నాయి. ఇవి కేవలం ప్రాథమిక అంచనాలు మాత్రమే. సమగ్ర వివరాల సేకరణ పూర్తయితే నష్టపోయిన పంట విస్తీర్ణం మరింత పెరిగే అవకాశముంది. జిల్లాలో బుధవారం నుంచి పంట నష్ట వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది నమోదు చేస్తున్నారు.

లంకలు విలవిల

నాలుగు రోజులుగా కృష్ణా వరద నీటిలో లంక గ్రామాలు విలవిలలాడుతున్నాయి. నీటిలో తడిసి చాలా ఇళ్లు కూలాయి. తలదాచుకుందామంటే గూడు లేదు. ఉన్న ఇళ్లు బురదగుంటలుగా మారాయి. టీవీ, ఫ్రిజ్‌లతో పాటు అన్ని వస్తువులు పాడయ్యాయి. వంట పాత్రలు పనికిరాకుండా పోయాయి. బట్టలు, విలువైన పత్రాలు, పిల్లల పుస్తకాలు తడిసి ముద్దయ్యాయి. పంటలు వరదలో చిక్కుకున్నాయి. – సాక్షి ప్రతినిధి, బాపట్ల



భట్టిప్రోలు మండలం లంక గ్రామాలకు ట్రాక్టర్‌పై తరలుతున్న ప్రజలు

భోజనం సంగతి దేవుడెరుగు గుక్కెడు నీటి కోసం లంక గ్రామాలు ప్రజలు అల్లాడుతున్నారు. ఇప్పుడు వరద తగ్గింది. ఇళ్లలో చేరిన బురదను తొలగించడం కష్టంగా మారింది. నిన్నటిదాకా ఇంటినిండా వరద నీరు. ఇప్పుడు బురదను కడుక్కుందామన్నా చుక్కనీరు దొరకడంలేదు. బురదను తొలగించుకునేందుకు కూలీలు కూడా అందుబాటులో లేరు. గోరుచుట్టపై రోకటి పోటు అనే చందంగా పరిస్థితి ఉందని బాధితులు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. అయినా చంద్రబాబు ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా లేదు.

జ్వరాల విజృంభణ

వరద ప్రభావంతో లంక గ్రామాల్లో పలువురు జ్వరాల బారినపడ్డారు. బయట ఆస్పత్రులకు వెళ్లలేని పరిస్థితి. ముంపువాసుల్లో చాలామంది పేదలు. రెక్కాడితేగానీ డొక్కాడని వారున్నారు. వారంరోజులుగా వారికి పనుల్లేవు. ఈ పరిస్థితుల్లో ఆస్పత్రికి వెళ్లి చూపించుకోవాలంటే వేలకు వేలు కావాల్సిందే. చాలామంది డబ్బుల్లేక లంకల్లోనే బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. బయటకు వచ్చి చూపించుకుందామన్నా ప్రభుత్వం కనీసం బోట్లు ఏర్పాటు చేయలేదు.

బాబు హామీ గాలికి ..

చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు తుపాను, వరదల్లో నష్టపోయిన ప్రతి ఎకరాకు రూ. 20 వేలకు తగ్గకుండా పరిహారం ఇవ్వాలని నాడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని నేడు పలువురు లంకగ్రామాల రైతులు గుర్తుచేశారు. ఇప్పుడు అధికారంలో ఉన్న చంద్రబాబు తగినంతగా పరిహారం అందజేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మూగజీవాల అరణ్యరోదన

నాలుగు రోజులుగా వరద నీటిలో చిక్కుకున్న వేలాది పశువులు గ్రాసం కోసం అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా ముంపులో ఉన్న లంక గ్రామాల్లో వేలాది పశువులు పస్తులతో అల్లాడుతున్నాయి. బుధవారం జిల్లా కలెక్టర్‌తోపాటు కొందరు ప్రజాప్రతినిధులు, పశుసంవర్థకశాఖ దాణా అందిస్తున్నట్లుగా ఫొటోలకు ఫోజులిచ్చారు.ఎంతమందికి ఇచ్చారంటే శాఖ అధికారులు స్పందించడం లేదు. కానీ క్షేత్రస్థాయిలో బాధిత రైతులందరికీ దాణా ఇవ్వలేదు. మొక్కుబడిగా ఇచ్చి చేతులు దులుపుకున్నారు. నాలుగు రోజుల వరద పుణ్యమాని వేమూరు, రేపల్లెతోపాటు జిల్లావ్యాప్తంగా రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా కృష్ణా నది ముంపు ప్రాంతాలలో దెబ్బతినండతో గ్రామాలకు రాకపోకలకు వీల్లేకుండా ఉంది. అరవింద వారధిపై బురదతోపాటు చెత్త పెద్ద ఎత్తున చేరింది.

అంధకారంలోనే లంకగ్రామాలు

కృష్ణాకు వరద సంభవించి నాలుగు రోజులైనా లంక గ్రామాల్లో విద్యుత్‌ను పునరుద్ధరించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలు అంధకారంలో అల్లాడి పోతున్నారు. దోమలు, విషపురుగుల నుంచి తప్పించుకునేందుకు నానాతంటాలు పడుతున్నారు. విద్యుత్‌ను తక్షణం పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నా అధికారులు స్పందించడంలేదు. వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాలనలో 2023 డిసెంబర్ 5న జిల్లాలో మిచాంగ్ తుఫాను ప్రభావంతో 261 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. అయితే, అధికారులు రెండవరోజు సాయంత్రానికే సరఫరాను పునరుద్ధరించారు.

న్యూస్‌రీల్

వరద బాధితుల కోసం తాగునీరు, బిస్కెట్లు తరలింపు

నరసరావుపేట: జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు విజయవాడ వరద బాధితుల సహాయార్థం మినరల్ వాటర్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్స్, బట్టలు, కొవ్వొత్తులను సేకరించామని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. వీటిని బాధితులకు అందజేసేందుకు బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకంకు అందజేశారు. నరసరావుపేట మండలం తరఫున రూ.1.05 లక్షల విలువైన వస్తువులను సేకరించామని ఎంపీడీవో నాగిశెట్టి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. వీటిని అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బందితో కలిసి కలెక్టరేట్‌కు అందజేశామన్నారు.

జీపీఎస్ కలిగిన లారీలకే ఇసుక రవాణాకు అనుమతి

– జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట: జీపీఎస్ కలిగి గనుల శాఖ వద్ద నమోదు చేసుకున్న లారీలను మాత్రమే ఇసుక రవాణాకు అనుమతిస్తామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు యజమానులకు స్పష్టం చేశారు. ఉచిత ఇసుకపై బుధవారం జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జేసీ సూరజ్ గనోరేతో కలిసి ఆయన జిల్లా స్థాయి సమీక్షా సమావేశం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. వాహనం, దూరాన్ని బట్టి రవాణా చార్జీలు ఉంటాయన్నారు. ఈ మేరకు రుసుములు నిర్ణయించాలని జిల్లా రవాణాశాఖ అధికారిని ఆదేశించారు. రవాణా చేసే వాహనాలకు ఉచిత ఇసుక వాహనం అనే బ్యానర్ ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలో మొత్తం ఆరు స్టాక్ యార్డుల్లో ఇసుక ఉంచామని చెప్పారు. ప్రస్తుతం మాదిపాడులో మాత్రమే 24,755 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని తెలిపారు. ఇక్కడ సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. త్వరలో 5 పాయింట్లలో 5.39 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులోకి తెస్తామన్నారు.

6 వరకు కొండవీడు ఘాట్ రోడ్డు మూసివేత

నాదెండ్ల: ప్రముఖ పర్యాటక కేంద్రమైన కొండవీడులో ఇటీవలి వర్షాలకు కొండచరియలు విరిగిపడిన నేపథ్యంలో ఈ నెల 6వ తేదీ వరకు ఘాట్‌రోడ్డు మూసివేస్తున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి ఎస్ రామచంద్రరావు తెలిపారు. ఇటీవల ఘాట్ రోడ్డులో తుపాను కారణంగా పలు చోట్ల కొండచరియలు విరిగిపడిన విషయం విదితమే. అటవీశాఖ, ఆర్ అండ్ బీ అధికారులు ఆ కొండరాళ్లు, చెట్లను తొలగించారు. వర్షాలు కురుస్తున్నందున 6వ తేదీ వరకు పర్యాటకులను అనుమతించట్లేదని తెలిపారు.

ఆకలి కేకలు.. బురద మేటలు



రామాపురంలో ఇంటిని శుభ్రం చేస్తున్న మహిళ



కృష్ణా నది ఒడ్డున సామగ్రిని శుభ్రం చేసుకుంటున్న దృశ్యం



వరదలో కొట్టుకుపోయి చెట్లకు చిక్కుకున్న చేపల వలలు

- మత్స్యకారుల కన్నీటి వెతలు
- వరద, భారీ వర్షాలతో తీవ్ర నష్టం
- వేటకు వెళ్లలేక కరువైన ఉపాధి
- ఆర్థికంగా చితికిపోయిన బతుకులు
- బురదమయంగా నివాసాలు
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపు

దాచేపల్లి: కృష్ణమ్మ ఉగ్ర రూపానికి మత్స్యకారుల జీవితాలు కకావికలం అయ్యాయి. నదినే నమ్ముకుని లాగుతున్న బతుకు నావ ఆగిపోవటంతో వారి జీవితాలు చీకటిమయంగా మారాయి. కృష్ణా నదిలో వరద ఉధృతంగా ప్రవహించటంతో పల్నాడు జిల్లా రామాపురం మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారు. నాలుగు రోజులపాటు వారి నివాసాలు వరద నీటిలో మునిగిపోయాయి. పడవలు, వలలు కొట్టుకుపోయాయి. నెల రోజుల నుంచి చేపల వేట నిలిచిపోవటం ఉపాధి లేకుండాపోయింది. ఇటు వరద నీటితో నిలువ నీడ కూడా కరువైందని వారు ఆవేదన చెందుతున్నారు. తమను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎటు చూసినా బురదమయమే

దాదాపు కాలనీలోని అన్ని ఇళ్లు నీటిలో మునిగిపోయాయి. ఎక్కడ చూసినా బురదమయం అయ్యాయి. నీటితోపాటు ఇళ్లలోకి విషసర్పాలు, పురుగులు చేరాయి. వరద ఉధృతి తగ్గడంతో బుధవారం నుంచి ఇళ్లను శుభ్రం చేసుకునేందుకు వారు ప్రయత్నిస్తున్నారు. ఇంట్లో పేరుకున్న బురద, వ్యర్థాలను బయట పడేస్తున్నారు. చాలా వరకు సామగ్రి వరద నీటిలో కొట్టుకుపోగా.. మిగిలినది బురదతో పనికిరాకుండా పోయింది. కొన్నింటిని శుభ్రం చేసుకుంటున్నారు. ఇళ్ల గోడలు నానిపోయి దెబ్బతిన్నాయి.

కొట్టుకుపోయిన పడవలు, వలలు

రామాపురం మత్స్యకారులకు చెందిన పడవలు, పెద్ద బోట్లను ఒడ్డున లంగర్ వేసి వదిలేశారు. వరద నీటిలో అవన్నీ కొట్టుకుపోయాయి. 300 కేజీల వలలు కూడా కొట్టుకుపోయాయని వాపోయారు. కృష్ణా నదిలో చేపల వేట నిలిచిపోవటంతో ఆకలి కేకలు తప్పడం లేదు. అధికారుల హెచ్చరికలతో నెల రోజులుగా ఇళ్ల వద్దే ఉంటున్నారు. సుమారుగా 60 కుటుంబాలు చేపల వేటపైనే ఆధారపడి ఉన్నాయి. 250 మందికిపైగా నిత్యం వేటకు వెళ్లేవారు. అలా వచ్చే కొద్ది మొత్తంతోనే తమ కుటుంబాలను పోషించుకునేవారు. ఇప్పుడు వేట నిలిచిపోవటంతో పూట గడిచే పరిస్థితి కనిపించటం లేదు. ప్రభుత్వం తమను పూర్తిస్థాయిలో ఆదుకోవాలని కోరుతున్నారు. ఆహారం అందించాలన్నారు. అందరికీ పక్కా గృహాలతోపాటు వలలు, పడవలు పాగొట్టుకున్న వారికి ఆర్థికసాయం చేయాలన్నారు.

శిథిలాలు కాదు.. రోడ్డేనండీ!



పూర్తిగా ధ్వంసమైన అమరావతి-పెదమద్దూరు రోడ్డు

అమరావతి: వరదల కారణంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అమరావతి నుంచి విజయవాడు వెళ్లే మార్గంలోని పెదమద్దూరు రోడ్డు పూర్తిగా ధ్వంసం అయింది. దీంతో అమరావతి – విజయవాడ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు అర కిలో మీటరు దూరం నడిచి వెళ్లాలన్నా నరకం కనిపించేలా రోడ్డు ధ్వంసమైంది. వైకుంఠపురం, పెదమద్దూరు గ్రామాల వారు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రెండు గ్రామాల వారు నరుకుళ్ళపాడు, ఎండ్రాయి, చావపాడు మీదుగా సుమారు 12 కిలోమీటర్లు తిరిగి వస్తున్నారు. గతంలో తుళ్లూరు– అమరావతి వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.44 కోట్లు మంజూరు అయ్యాయి. పనులకు శంకుస్థాపన కూడా జరిగింది. ఇందులో భాగంగా మద్దూరు వద్ద వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. ఆ పనులు సుమారు 60శాతానికిపైగా పూర్తయ్యాయి. కొత్త ప్రభుత్వం రావటంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ప్రస్తుతం విజయవాడ-అమరావతి బస్సులు పెదమద్దూరు వరకు వచ్చి వెనుదిరుగుతున్నాయి. మండల పరిధిలోని లింగాపురం కంటివాగు, దిడుగు పవర్ ప్లాంట్, పొందుగల రోడ్డు, మునగోడు, జూపూడి ప్రాంతాల వద్ద కూడా రోడ్డు ధ్వంసమైంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు ఉపాధ్యాయ దినోత్సవం

నరసరావుపేట ఈస్ట్: ఉపాధ్యాయ దినోత్సవానికి జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఏర్పాట్లు చేశారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ వేడుకలను గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు భువనచంద్ర వేదికగా నిర్వహించనున్నారు. అన్ని ప్రభుత్వ యాజమాన్యాలలోని పాఠశాలల నుంచి 68 మందిని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలతో సత్కరించనున్నారు. ప్రతి మండలం నుంచి ఇద్దరు చొప్పున ఎంపిక చేశారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో వేడుకలకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ జి.ఎస్.ధనుంజయ్, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, పాఠశాల విద్య ఆర్‌జేడీ బి.లింగేశ్వరరెడ్డి వేడుకల్లో పాల్గొంటారని జిల్లా విద్యాశాఖాధికారి బుధవారం తెలిపారు.

జిల్లాలో 148.6 మి.మీ. వర్షపాతం

నరసరావుపేట: గడిచిన 24 గంటల వ్యవధిలో జిల్లాలో 148.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు బుధవారం వెల్లడించారు. అత్యధికంగా పెదకూరపాడులో 19 మి.మీ. కురిసిందన్నారు. జిల్లాలో వెల్దుర్తి మినహా మిగతా 27 మండలాల్లో వర్షం పడింది. నరసరావుపేటలో 5.6, మాచర్ల – 13.6, దుర్గి – 7.2, రెంటచింతల – 2.6, గురజాల– 4, దాచేపల్లి – 3.2, కారెంపూడి – 6.2, పిడుగురాళ్ల – 4.6, మాచవరం – 2.2, బెల్లంకొండ – 7.6, అచ్చంపేట – 6.6, క్రోసూరు – 9.2, అమరావతి – 6.8, సత్తెనపల్లి – 8.8, రాజుపాలెం – 6.2, నకరికల్లు – 2.8, బొల్లాపల్లి – 2.4, వినుకొండ – 4.2, నూజెండ్ల – 1.6, శావల్యాపురం – 3.8, రొంపిచర్ల – 2.4, ఈపూరు – 3.8, ముప్పాళ్ల – 5.2, నాదెండ్ల – 2,2, చిలకలూరిపేట – 2.4, యడ్లపాడులో 3.4 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.